# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

మంగళవారం /26.03.2024


# కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు




తెలంగాణవీణ,జాతీయం

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు భారీ షాక్ తగిలింది. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. ఈ నాటి విచారణ సందర్భంగా ఆమె పిటిషన్ పై తీర్పును కాసేపు రిజర్వ్ లో ఉంచిన కోర్టు... కాసేపటి క్రితం తీర్పును వెలువరించింది. ఆమెకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఏప్రిల్ 9వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తీర్పును వెలువరించింది. ఆమెను తీహార్ జైలుకు తరలించాలని పోలీసులను ఆదేశించింది. కాసేపట్లో కవితను తీహార్ జైలుకు పోలీసులు తరలించనున్నారు. కోర్టు తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణులు షాక్ కు గురయ్యారు. మరోవైపు, కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ పై ఏప్రిల్ 1న పూర్తి విచారణ జరుపుతామని కోర్టు తెలిపింది. తన కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, తనకు మధ్యంత బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కవిత కోరారు. అయితే, ఆమె విన్నపాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఇంకోవైపు, కవితను మరో 15 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరినప్పటికీ... ఆమెకు కోర్టు రిమాండ్ విధించడం గమనార్హం. రిమాండ్ లో ఉన్న కవితను ఈడీ తమ కస్టడీకి కోరే అవకాశం ఉంది.

# తమిళనాడులో బీజేపీ మాస్టర్ ప్లాన్..



తెలంగాణవీణ,జాతీయం

* అన్నాడీఎంకేపై పన్నీర్ సెల్వంను అస్త్రంగా వాడుకునేందుకు బీజేపీ ప్రయత్నం
* రామనాథపురం నియోజకవర్గం నుంచి ఆయనను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపాలని వ్యూహం
* దక్షిణాదిలో పట్టు సాధించాలనే యోచనతో కాషాయ పార్టీ ప్రణాళిక

అన్నాడీఎంకే బహిష్కృత సీనియర్ నేత, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వంను ప్రసన్నం చేసుకునే దిశగా బీజేపీ పావులు కదుపుతోంది. అన్నాడీఎంకేపై ఆయనను అస్త్రంగా వాడుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పన్నీర్ సెల్వంను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపాలని బీజేపీ వ్యూహం రచిస్తోంది. ఇందులో భాగంగా ఆ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిని కూడా పోటీలో దించబోమని పన్నీర్‌సెల్వంకు కాషాయ పార్టీ పెద్దలు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇక ఈసారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో భారీగా సీట్లు దక్కించుకోవాలనే ప్రణాళికతో బీజేపీ ముందుకు వెళ్తున్న విషయం తెలిసిందే. కనీసం 400 సీట్ల వరకు సాధించి మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా కలిసొచ్చే ఏ అవకాశాన్ని కూడా కాషాయ పార్టీ వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ప్రధానంగా దక్షిణాదిలో పట్టు సాధించాలనే పట్టుదలతో ఉంది. ఆ దిశగానే పార్టీ అధిష్ఠానం వ్యూహాలు రచిస్తోంది కూడా. దీనిలో భాగంగా ఇప్పుడు పన్నీర్‌సెల్వంకు పూర్తి మద్దతు ప్రకటించిందని తెలుస్తోంది.

# హీరో నానిని కలిసిన బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్!



తెలంగాణవీణ,హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలకు బ్రిటీష్ డిప్యూటీ హైకమిషర్‌గా వ్యవహరిస్తున్న గారెత్ విన్ ఓవెన్.. టాలీవుడ్ హీరో నానిని కలిశారు. హైదరాబాద్‌లో నాని నివాసానికి వెళ్లిన గారెత్.. మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ విషయాన్ని గారెత్ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. నానిని కలవడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ తెలిపారు.' నానిని కలవడం ఎంతో ఆనందం కలిగించింది. నాని సినీ, వ్యక్తిగత జీవితం గురించి అడిగి తెలుసుకున్నా. తెలుగు చిత్ర పరిశ్రమతో బ్రిటన్ సంబంధాలు ఏ విధంగా బలోపేతం చేసుకోవచ్చు అనే అంశంపై ఇద్దరం చర్చించాము. తాను నటించిన రెండు సినిమాలు చూడమని నేచురల్ స్టార్ నాని నాకు సూచించారు. ఏ సినిమాలు చూడాలో నాకు చెప్పండి' అని గారెత్ విన్ ఓవెన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. గారెత్‌కు నెటిజన్స్ తమ సలహాలు ఇస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు..!



తెలంగాణవీణ,హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో ఏసీబీ అధికారులు రంగప్రవేశం చేయడం ఇప్పుడు కీలక మలుపు అని చెప్పాలి. ఈ కేసులో అరెస్ట్ అయిన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, డీఎస్పీ ప్రణీత్ రావులు.. వ్యాపారవేత్తలు, హవాలా వ్యాపారం చేసే వారు, నగల షాపు యజమానులపై బెదిరింపులకు పాల్పడి భారీ స్థాయిలో ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వచ్చాయి. ఇలా కూడబెట్టిన ఆస్తుల్లో ఖరీదైన విల్లాలు, భూములు కొన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఏసీబీ అధికారులు ఈ కేసుపై దృష్టి సారించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన వారితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఆస్తుల చిట్టాను బయటకు తీసే పనిలో పడినట్టు తెలుస్తోంది. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారితో పాటు అనుమానితులు కూడా హడలెత్తిపోతున్నారు.

# గంజాయి అడ్డాగా హైదరాబాద్..

తెలంగాణవీణ,హైదరాబాద్



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టును రట్టు చేసింది. రూ.11 లక్షల విలువ చేసే 30 కేజీల గంజాయి సీజ్ చేసింది. గంజాయి ని బ్రౌన్ కలర్ ప్యాకెట్స్ లో ప్యాకింగ్ చేసిన ఆటోలో దాచి స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్ చేయగా.. మరొకరు పరారీ ఉన్నారు. పాత బస్తీ కి చెందిన మహ్మద్ అయాన్, మహ్మద్ మొయినుద్దీన్, దీపక్ పటేల్ పై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఒరిస్సా కు చెందిన దీపక్ పాటిల్ గంజాయిని భద్రాచలం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సుమారు 30 కేజీల గంజాయిని ఆటో ట్రాలీ లో హైదరాబాద్ కు స్మగ్లింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. దీపక్ పాటిల్, స్నేహితుడు మొయినుద్దీన్ కలిసి పోలీసులకు చిక్కకుండా బైక్ పై పెట్రోలింగ్ చేశారు. దీంతో విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ బృందం అక్కడ మాటు వేసి పట్టుకున్నారు. చిన్న చిన్న ప్యాకెట్స్ లో గంజాయి ప్యాకింగ్ చేసి హైదరాబాద్ లో విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. నిందితుల నుండి 30 కేజీల గంజాయి, ఆటో, బైక్ తో పాటు 2 మొబైల్ సీజ్ చేశారు.